
వాల్తేరులో బయలుదేరిన ఒకటవ నెంబరు సిటీబస్సు రామ్‌నగర్‌వద్ద ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి ప్రక్కనున్న కొండను ఢీకొంది. తత్ఫలితంగా అప్పలనాయుడు అనే ఓ రైల్వే ఉద్యోగి అక్కడికక్కడే మరణించాడు.

**ఉద్యోగంకోసం తండ్రిచావును కోరితే, రేపు తన కొడుకు మాత్రం తనలా కోరుకోడా?**



# నిరుద్యోగమా! వర్ధిల్లు

పి. భవానీ ప్రసాద్

"ఎవరి అప్పలనాయుడు ?"

"సుబ్బారావు తండ్రి"

"సుబ్బారావు ఎవరు ?"

"సుబ్బారావు ఒక నిరుద్యోగి."

"నిరుద్యోగా !"

"అవును. నాలుగు సంవత్సరాలుగా నిరుద్యోగి."

"మరి. ఉద్యోగంకొరకు ప్రయత్నం చేయలేదా ?"

"ఎందుకు చేయలేదూ ! నాలుగు సంవత్సరాలికి ఇరువై జతల జోళ్ళు అరిగాయి. ఏ బాపతువయితేనేమి- సుమారుగా ఓ అరవై ఇంటర్వ్యూలకువెళ్ళుంటాడు."

"మరి ఫలితం !"

"ఫలితమా ! సెర్చిలైటువేసి వెదకండి, ఎక్కడైనా కనిపిస్తుందేమో !"

"అబ్బ ! ఆశ ! అంతసులువుగా కనిపిస్తుందేమిటి ? నీ దగ్గర ఎవరిదైనా మంత్రిగారి రికమండేషను వుందా ?"

"ఊహు ! లేదు."

"పోనీ, ఆమ్యా మ్యా ఏమైనా ఇవ్వగలవా !"

"అదేమిటి ? ఏదో పిల్లి అరుపులా వుంది."

"నువ్వెక్కడో బి.సి. మనిషిలాఉన్నావే! ఈ ఇరవయ్యవ శతాబ్దంలో ఏ చిన్నపిల్లాడ్ని పిలిచి అడిగినా చెబుతాడు, ఆమ్యామ్యా అంటె బరువు అని."

"బరువా! మీరే మిటో అన్నీ క్రొత్త పదాలే చెబుతున్నారు. నే నెప్పుడూ విన్లేదవి "

"చూడు నాయనా! నీకు స్వచ్ఛమైన తెలుగుతప్ప వేరేదీ అర్థం కాదనుకుంటా. పోనీ, స్వచ్ఛమైన తెలుగులోనె చెబుతాను లంచం ఏమైనా యివ్వగలవా?"

"లంచమా! ఎంత?"

"కనీసం అయిదు వేలైనా...."

"అయిదువేలా! చూడండి. ఆ అయిదు వేలు వుంటె జగదాంబ ఎదురుగ చిన్న పాన్‌షాప్ పెట్టుకుని హాయిగా బ్రతికేయవచ్చు."

"అయితే నీవిక వెళ్ళొచ్చు. ఒక్క సెర్చిలైటు కాదుగదా వెయ్యి సెర్చిలైట్లు వేసి వెదకినా నీకు ఫలితం కనిపించదు."

అంతే అప్పట్నించీ అలా ఇంటర్వ్యూలకు వెళుతున్నప్పటికీ నిరుద్యోగిగానే వుండిపోయాడు సుబ్బారావు.

"సుబ్బారావు నిరుద్యోగి కావడమే కాకుండా మరొకటి కూడా అయ్యాడు."

"ఏమిటది ?"

"సంసారి."

"అయ్యో పాపం."

"పాపమేముందిలే. నిరుద్యోగులు ఎంతమంది పెళ్ళిళ్ళు చేసుకుని సంసార్లు కావడంలేదు. కాని. సుబ్బారావు ఇక్కడొక పొరబాటుచేశాడు."

"ఏమిటది ?"

"ప్రేమించి పెళ్ళిచేసుకున్నాడు."

"ఎవర్ని ?"

"అలివేలు మంగతాయార్ని."

"అయితే మరీ మంచిది. ప్రేమించింది కాబట్టి. అలివేలు మంగతాయారు ప్రస్తుత సుబ్బారావు పరిస్థితిని బాగా అర్థం చేసుకుంటుంది?"

"ఏం అర్థం చేసుకోవడంలే. ఇపుడు వచ్చిన చిక్కల్లా అదేకదా!"

"ఏమయింది?"

"చదువుకొనే రోజుల్లో ఏవో పుస్తకాలు కొనాలని. ఫీజులు కట్టాలని చెప్పి ఇంట్లో వసూలుచేసిన డబ్బుతో సుబ్బారావు అలివేలుమంగతాయారును వెంటేసుకుని సినిమాలకి. షికార్లకి తెగ తిరిగేసేవాడు. ఆ మూన్నాళ్ళ ముచ్చట చూచి అలివేలు మంగతాయారు సుబ్బారావుని అతి గాఢంగా ప్రేమించేసింది. తీరా పెళ్ళయిన తరువాత చూస్తే ఏముంది-ఆ మూన్నాళ్ళ ముచ్చటకాస్త ముసుగుతన్ని మూలన కూర్చుంది."

"ఏ మాట కామాటే చెప్పుకోవాలి. పాపం సుబ్బారావుకి మాత్రం. పెళ్ళాన్ని వెంటేసుకుని సరదాగా సినిమాలకి వెళ్ళాలని యెందుకులేదు?"

"ఉంది. కాని ఎలా! అందుకు డబ్బుండాలికదా!"

"ఇదో పెద్ద సమస్య ఏమిటి. "నాన్నా! నేను. నా పెళ్ళాం సినిమాకి వెళ్ళాలి. ఓ పది రూపాయ లివ్వండి" అని తండ్రిని అడగవచ్చుగా!"

"ఎలా అడుగుతాడు? తను తనతోబాటు అలివేలు మంగతాయారు. సెన్త్ చదువుతున్న తమ్ముడు. పెళ్ళికి యెదిగిన చెల్లి. ఇంకా తల్లి - వీళ్ళందరి పొట్టలు ఆ ఒక్క తండ్రి సంపాదన మీదే గడవాలి. పైగా. ఇంట్లో వాళ్ళందర్నీ కాదని తనొక్కడూ తన పెళ్ళాన్ని మాత్రమే వెంటబెట్టుకుని ఎలా సినిమాకి వెళ్ళగలడు? తన చెల్లెలు. తమ్ముడు తనలాటి వాళ్ళు కారా ? వాళ్ళకు మాత్రం సినిమా చూడాలని వుండదా ! అందుకే ఏ ముఖం పెట్టుకుని తండ్రి వద్దకు వెళ్ళి అడుగుతాడు ?"

"అదే తనకో ఉద్యోగం వుండివుంటే. తన జీతంతో తన ఇష్టం వచ్చినట్లు పెళ్లాన్ని సినిమాకే తీసుకెళ్ళనో ! లేక సింహాచలమే తీసుకెళ్ళనో ?"

## మల్లెపందిరి

### పరాకు (గోత్ర స్ఖలనం)

రాధామోహన మందిరాదుపగతః చంద్రావళీ మూచివాన్

''రాధే క్షేమమయేఽసి ?'' తస్యా-చనం శ్రుత్వాహ చంద్రావళీ।

''కంస, కేమ మయే?'' ''విముగ్ధవచసే, కంసః క్వ దృష్ట స్త్వయా''

''రాధా క్వే''తి విలజ్జితో నతముఖః స్మేరో హరిః పాతు వః।

రాధగారింట్లో టిఫినూకాఫీ తీసుకుని. కునుకుతీసి తీయని క్షణాలేవో నెమరు వేసుకుంటూ చంద్రావళిగారింటికి వచ్చి ఆవిణ్ణి పలకరిస్తున్నాడు. "రాధా క్షేమంగా వున్నావా ?" చంద్రావళి (కొరడాదెబ్బ తిన్నదానిలా) ఘాటుగా తిరుగు ప్రశ్న వేసింది "కంసుడా! క్షేమంగా వున్నావా ?" (ఆవిడ తనమీద దెబ్బతీస్తోందనుకోలేదు) "అమాయికంగా మాటాడుతున్నావు కంసుడెక్కడ కనపడ్డాడు నీకు ?" (చురుకు తగిలిస్తూ అంది) "రాధ యెక్కడ కనపడింది నీకు ?" (అప్పటికి అర్థమయింది తను మొదట తప్పుగా సంబోధించిన సంగతి.) వెంటనే సిగ్గుపడి తల వంచుకుని నవ్వుకున్నాడు. ప్రేమ వ్యవహారంలో పరాకు పనికిరాదు.

—సౌభరి

"అయితే ఇపుడు పరిష్కార మార్గమేమిటి ?"

"ఎలాగైనాసరే. ప్రస్తుతం సుబ్బారావు కొక ఉద్యోగం కావాలి."

"ఎలా ?"

"ఎలా ఏమిటి ? ఆలోచిస్తే ఏదో ఒక మార్గం దొరక్కపోదు."

"అవును. ఆలోచించాలి. ఆలోచించడం కాదు, ఆలోచించితీరాలి."

రామకృష్ణా బీచ్‌లో కూర్చుని ఆలోచించడం మొదలుపెట్టాడు సుబ్బారావు.

కడలిలోని కెరటాల్లా. చెరువులోని చేపల్లా. నదిలోని అలల్లా. మండుతున్న అగ్నిజ్వాలలా ఒకదాని వెనుక ఒకటి పైపైకి ఎగసిపడుతున్నాయి సుబ్బారావు మదిలోని ఆలోచనలు.

ఉన్నట్టుండి కడలికెరటంవచ్చి వొడ్డున పడినట్టు. చెరువులోని చేప గట్టున పడినట్టు ఒక మంచి ఆలోచన సుబ్బారావు మనసు నుంచి బయటపడింది.

వెంటనే యిక వెనకా ముందు ఏమీ ఆలోచించలేదు. కళ్ళు రెండూ మూసుకుని సింహాచలం అప్పన్నని తలంచుకుని



## కావలెను

పాక్షిక సమయంలో శక్తి సూటింగ్ షర్టింగ్ మరియు చీరల అమ్మకం అభివృద్ధి చేయుటకు జీతం లేదా కమీషన్‌గా నెలకు రు. 700/- సంపాదించుటకు ఏజెంట్లు కావలెను. ఉచిత సాహిత్యం మరియు శాంపిల్స్ కోసం దరఖాస్తు చేయండి.

**SHAKTI TEXTILES AGENCY (AJ)**
**Post Box No-1138, Delhi-110 006.**

## సినీ క్విజ్ పోటీ

తెలుగు సినీ క్విజ్ పోటీలో పాల్గొని రూ. 5,000 లు నగదు బహుమతులు గెలవండి! పోటీలో పాల్గొన్న సభ్యుల్లో ప్రతి నెలలో 5గురికి ఉచితంగా బెంగుళూరు నగర పర్యటన అవకాశం!! ఉచిత ఎంట్రీల కొరకు 30 పై. స్వంత చిరునామా కవరుతో వెంటనే వ్రాయండి.

విజయా బుక్ వరల్డ్,
40/1 ఏ.వి.రోడ్డు, బెంగుళూరు-2

## నెరసిన జుట్టు

రంగులవల్ల కాదు. మా 'కేశరంజని' ఆయుర్వేదిక్ హెయిర్ ఆయిల్ నెరసిన జుట్టును మామూలు నల్లరంగు నిస్తుంది. పైగా అది మెదడుకు, కళ్ళకు మంచి టానిక్కు. ధర రు. 12/— సంతృప్తి, శాశ్వత ఫలితానికి 3ఫియల్స్ రు. 27/—.

SHYAM AYURVED BHAVAN
P.O. KATRI SARAI (GAYA)

ఉచితం ఉచితం ఉచితం

## తెల్ల మచ్చలు

ఏ రకం తెల్లమచ్చలైనాసరే వాని రంగు మరియు ఎర్రమచ్చలరంగు మాప్రఖ్యాత ఔషధం "డాగ్ వినాశక్" వాడిన యెడల మూడు దినములలో మారును. అటుపైన మామూలు చర్మంవలె నుండిపోవును. ప్రచారం కొరకు ఒక సీసా మందు ఉచితంగా పంపెదము. వెంటనే వ్రాయండి.

**Address**
**Samaj Kalyan (R.L. 78)**
**(P. O) Katri sarai (Gaya)**

ఆయన రూపాన్ని కళ్ళముందుంచుకున్నాడు.

"స్వామీ! నిన్నెప్పుడూ నేనేమీ కోరలేదు. కాని, ఇన్నాళ్ళకి నిన్ను నేనొక కోరరాని కోరిక కోరుతున్నాను. ఏదైనా యాక్సిడెంటులో మా నాన్న సడన్‌గా చనిపోయేటట్టు చూడు. అంతే! ఆ తరువాతది నే చూసుకుంటాను. ఇంక నిన్నెప్పుడూ ఏ కోరికా కోరను. ఈ ఒక్క కోరిక మాత్రం తీర్చు. నా పుట్టబోయే సంతానానికి నీ పేరు పెట్టుకుంటాను" అంటూ మనసారా మనసులోనే కోరుకున్నాడు.

ఆ తరువాత ఇంటికి తిరిగివెళ్ళేటప్పుడు అనుకున్నాడు, తన కోరిక చాలా ఘోరాతి ఘోరంగా ఉందని.

అయినా దేవుడు ఇటువంటి ఘోరమైన కోరికల్ని తీరుస్తాడేమిట్లే అని వెంటనే మనసును సరిపెట్టేసుకున్నాడు కూడా.

ఆ రాత్రి గడిచింది.

మరుసటిరోజు అప్పలనాయుడు డ్యూటీకి బయలుదేరాడు. మరి అప్పల నాయుడికి ఆయుష్షు పూర్తయిపోయిందో లేక పుట్టబోయే సంతానానికి తన పేరు పెట్టుకుంటానన్నాడని సుబ్బారావుమీద సింహాచలం అప్పన్నకి కనికరం ఎక్కువైపోయిందోగాని, సిటీబస్సు యాక్సిడెంటు కావడం వెంటనే అక్కడికక్కడే అప్పల నాయుడు మరణించడం జరిగిపోయింది.

శవంమీద పడి సుబ్బారావు తల్లి ఘొల్లుమని ఏడుస్తోంది. సుబ్బారావు చెల్లెలు, తమ్ముడు కూడా ఏడుస్తున్నారు.

కాని సుబ్బారావుకి మాత్రం ఏడుపు రావడం లేదు. ఎందుకోగాని అతడు తన తండ్రి చావుని నమ్మలేకపోతున్నాడు.

తనెప్పుడూ దేవుణ్ని ఏమీ కోరలేదు. కాని, నిన్న - అదైనా ఆవేశంలో ఏదో కోరేశాడు. ఆ మరుసటి రోజుకే అది నిజమై కూర్చుంటుందని తనుపొరబాటుగా కూడా ఊహించలేదు.

ఏమయితేనేం, అప్పలనాయుడు పోయాడు, యథావిధిగా మిగిలిన కార్యక్రమాలన్నీ పూర్తయ్యాయి.

ఓ రెండు నెలలు కాలసముద్రంలో రెండు కన్నీటి బొట్లులా కలిసిపోయాయి.

"ఇపుడు సుబ్బారావు వుద్యోగి."

"ఉద్యోగా! ఎక్కడ?"

"రైల్వేలో."

"రికమండేష నేమయినా సంపాదించాదేమిటి?"

"అబ్బే! అటువంటి దేమీలేదు."

"లంచం ఏమైనా యిచ్చాడా!"

"ఊహూ! అదీకాదు."

"మరి, ఎలా వచ్చింది వుద్యోగం."

"అతని తండ్రిపోయిన తరువాత ఆ ఇంటికి సుబ్బారావేగా పెద్ద దిక్కు."

"అవును."

"ఆ ఇంటి పోషణ జరగడానికి మరో ఆధారమేమీ లేదుగా! అందుకని...."

"ఆఁ! అందుకని...."

"రైల్వేవారే సుబ్బారావుని పిలిచి ఉద్యోగం ఇచ్చారు."

"భలే బాగుంది. నిరుద్యోగ సమస్య తీరే విధానం ప్రభుత్వంవారు కనిపెట్టకపోయినా, కొంతవరకూ తీరే విధానాన్ని మన సుబ్బారావు కనిపెట్టాడు."

"అంటే, నీ వుద్దేశ్యం!"

"ఏముంది, అవకాశం వున్న ప్రతి నిరుద్యోగి సుబ్బారావుకిమల్లే ఆలోచిస్తే— వెంటనే వుద్యోగి అయిపోవచ్చుగా!"

"ఈ మధ్య నువ్వు సుబ్బారావును చూశావా!"

"ఊహు! చూల్లేదు. ఏం?"

"చూస్తే నువ్విలా మాట్లాడేవాడివి కాదు."

"ఎందుచేత?"

"ఇదివరకు, చెరగని చిరునవ్వుతో ఎప్పుడూ హుషారుగా వుండే సుబ్బారావు ఇపుడు ఏదో దీర్ఘకాల రోగంతో బాధపడుతున్న వాడిలా తయారయ్యాడు."

"అతడికేమయింది? ఏదైనా అనారోగ్యమా!"

"ఊహు! అదేం కాదు."

"మరేమిటి?"

"అతడు తండ్రయ్యాడు."

"అంతేగదా!"

"అతడు తండ్రయింది కూతురికి కాదు, కొడుక్కి."

"అయితే?"

"అయితే కాదు. రేపా కొడుకు పెద్ద వాడైన తరువాత సుబ్బారావులాగే ఆలోచిస్తేనో!"

"నిజమే! సుబ్బారావుచూపినపరిష్కార మార్గం అంత ఆచరణయోగ్యంగా లేదు. అయితే మరి నిరుద్యోగ సమస్య...."

"తప్పకుండా తీరుతుంది కాని ఇప్పుడు కాదు. మన తర్వాత తర్వాత తర్వాత...."

